# అక్రమంగా దిగుమతి అవుతున్న జన్యుమార్పిడి విత్తనాలు

**జన్యుమార్పిడి** ఆహారానికి ప్రభుత్వం ఎటువంటి అధికార పూర్వక అనుమతులు యివ్వ నప్పటికీ, జన్యుమార్పిడి ఆహారంవలన సంభవించబోయే హానిగురించి పలు సంస్థలనుండి, ప్రజాసంఘాలనుండీ తీవ్రమయిన వ్యతిరేకతలు వ్యక్తం అవుతూనే వున్నప్పటికీ, జన్యుమార్పిడి పంటలను పండించటంకోసం దేశంలోకి టన్నుల కొద్దీ జన్యుమార్పిడి విత్తనాలు అక్రమంగా దిగుమతి అవుతూనే వున్నాయి. ప్రజల ఆహారాన్ని జన్యు మార్పిడి ఆహారంతో కలుషితం చేస్తూనేవున్నాయి.

ఈ అక్రమ రవాణాను నిరోధించి, నివారించ వలసిన ప్రభుత్వ నియంత్రణ శాఖలు పట్టించుకోక పోగా, ఆ బాధ్యత తమది కాదంటే తమది కాదంటూ మరోశాఖ పైకి నెట్టి పూర్తి బాధ్యతారహితంగా నాటకాలాడుతున్నాయి. ఈ శాఖలు ఈ రకంగా వ్యవహరించటానికి గల కారణం, మన పాలకులు లోపాయికారీగా జన్యుమార్పిడి సంస్థలతో లాలూచీ పడివుండటం. బడా సామ్రాజ్యవాద జన్యుమార్పిడి విత్తనాల కార్పొరేషన్లు వివిధ ప్రభుత్వ నియంత్రణా శాఖలను తమ ప్రలోభ, ప్రభావాలలో వుంచుకోవటం.

గత దశాబ్ద కాలంగా దేశంలోకి జన్యుమార్పిడి మొక్కజొన్న విత్తనాలు 528 టన్నులమేరకు అర్జెంటీనానుండీ, 20 టన్నులు అమెరికానుండీ దిగుమతి చేసుకోబడ్డాయి. ఆ రెండు దేశాల్లోనూ ఉత్పత్తి అయ్యే మొక్కజొన్న పంటలో 90% మేరకు జన్యుమార్పిడి మొక్కజొన్న. అంతేకాక భారతదేశంలోకి, జన్యుమార్పిడి మొక్కజొన్నను పండించే దేశాలైన స్పెయిన్, బ్రెజిల్, ఫిలిప్పీన్స్ నుండి కూడా, జన్యుమార్పిడి మొక్కజొన్న విత్తనాలు దిగుమతి చేసుకోబడ్డాయి.

అంతేకాకుండా అమెరికానుండి 129 టన్నుల జన్యుమార్పిడి బీట్-పంచదార తయారు చేసే బీట్‌రూట్ విత్తనాలు-పంట పండించటంకోసం మనదేశంలోకి దిగుమతి చేసుకోబడ్డాయి.

ప్రభుత్వం, పరిశ్రమలకు చెందిన వివరాల ప్రకారం దేశంలోకి 149 టన్నుల కెనోలా విత్తనాలు (ఒక రకపు ఆవ జాతికి చెందిన మొక్క-దీనినుండి వంటనూనె తయారు చేస్తారు) అమెరికానుండీ, 100 టన్నులపైగా ఆస్ట్రేలియానుండీ దిగుమతి చేయబడ్డాయి. ఈ కెనోలా విత్తనాలు కూడా జన్యు మార్పిడి చేయబడ్డ విత్తనాలే!

వీటికితోడు మనదేశంలోకి అమెరికానుండీ, చైనానుండీ జన్యుమార్పిడి బొప్పాయి విత్తనాలూ, స్క్వాష్ అనే ఒక సొర రకం మొక్క విత్తనాలూ దిగుమతి అవుతున్నాయి.

పైన పేర్కొన్న దిగుమతులన్నీ అక్రమమైనవే! చట్టవిరుద్ధమైనవే!

పై వివరాలన్నీ వెల్లడై 3 నెలలు కావస్తున్నా, భారతప్రభుత్వంకానీ, తత్సంబంధిత ప్రభుత్వ నియంత్రణ శాఖలుగానీ ఏమీ పట్టించుకోక, బాధ్యత తమదికాదంటూ యితరులపైకి నెట్టి తప్పించు కొంటున్నాయి.

ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన డేటాలో యీ వివరాలన్నీ పొందుపరచబడి వున్నాయి.

ఈ విషయంలో వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన విదేశీ వ్యాపార డైరెక్టరు జనరల్, ఆర్థిక - పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుకు చెందిన మంత్రిత్వశాఖను యీ అక్రమ దిగుమతులుపై చర్య తీసుకో వాల్సిందిగా కోరాడు. ఈ ఫిర్యాదును ఆ శాఖకు చెందిన జన్యుమార్పిడి ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ, తగు చర్య తీసుకోవాల్సిందిగా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖకు పంపింది. దీన్ని తిరిగి ఆ శాఖ, ఫైనాన్సు మంత్రిత్వశాఖకు చెందిన రెవెన్యూ మరియు మొక్కలకు అంటురోగాలు తగులకుండా విడిగావుంచే విభాగానికి, తగు చర్య తీసుకోమంటూ పంపించి వేసింది. అంతేకాక వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన సహకార -రైతుల సంక్షేమానికి సంబంధించిన వ్యవసాయ మంత్రిత్వశాఖకు కూడా తగు చర్య తీసుకోమంటూ పంపించి వేసి చేతులు దులుపుకుంది.

ఈ రకంగా ఏ మంత్రిత్వశాఖకు ఆ మంత్రిత్వశాఖే బాధ్యత తీసుకోకుండా, జన్యు మార్పిడి పంటల విత్తనాల అక్రమ దిగుమతిని నిరోధించకుండా ఆటలాడుకుంటోంది.

ఇదీ మన దేశంలోని పాలకవ్యవస్థ ప్రభుత్వ పరిపాలనా శాఖలు ప్రజలయొక్క కీలకమయిన సమస్యలపట్ల, ప్రజలకు నష్టకరమైన జన్యుమార్పిడి ఆహారంపట్ల వ్యవహరిస్తున్న వైఖరి! అయినా మనది ప్రజాస్వామ్య వ్యవస్థే, ప్రజలకొరకు పనిచేస్తున్న వ్యవస్థేనంటూ నమ్మమంటున్నారు మన పాలకులు, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను సమర్థిస్తున్న మేధావులూ-నిపుణులూ!

జన్యుమార్పిడి ఆహారంయొక్క హానిపట్ల ప్రజలను నిరంతరం చైతన్యపరిచి, వారిని అందుకు వ్యతిరేకంగా ఉద్యమింపచేయాల్సిన తక్షణ అవసరం నేడు ఎంతైనా వుంది. ఈ కర్తవ్యం కేవలం కొద్దిమంది ఎన్‌జిఒ సంఘాలవల్ల ఫలప్రదంగా నిర్వహించటం సాధ్యంకాదు. ఇందుకు ప్రజా సంక్షేమ, శ్రేయస్సులను కోరే అందరూ పూనుకోవాలి!

ooooo